

## కాళేశ్వరం గొప్పతనం

# సుప్రీంకు తెలిసినా సీఎంకు అర్థమైతలే

> “రేవంత్ కమీషన్ల కక్కుర్తి.. కాంగ్రెస్ కమీషన్ల కక్కుర్తి.. ఒక్కొక్కటిగా బయటకు వస్తుంటే వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాళేశ్వరం కమిషన్లు, నోటీసులు అంటూ డ్రామాలాడుతున్నరు. ఘోష్ కమిషన్‌ను ఇట్లనే తెరపైకి తెచ్చింద్రు. ఫార్ములా–ఈ రేస్‌పై డ్రామా కొన్ని రోజులు.. ఎలక్ట్రిసిటీ డ్రామా కొన్ని రోజులు.. ఇట్ల ఒకటి తర్వాత ఒకటి ఎన్నిరోజులు.” -కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

బయటకొచ్చాయని, కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరంపై చేస్తున్న దుష్ప్రచారం కూడా త్వరలో తేలిపోతుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని బరాజ్‌లను కూలగొట్టి మళ్లీ టెండర్లు పిలిచి, 20 నుంచి 30 శాతం కమీషన్లు దండుకోవాలన్నదే కాంగ్రెస్ పార్టీ అసలు ఎజెండా అని ధ్వజమెత్తారు.

580 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటే, ముఖ్యమంత్రి అందాల పోటీలో ఉండటం కరెక్టేనా? అని నిలదీశారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు మంత్రులంతా టూర్ గైడ్లుగా మారారని విమర్శించారు. మిస్ వరల్డ్ పోటీదారులకు నిజాం కట్టిన చార్మినార్ లేదా కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులను తప్ప, కాంగ్రెస్ పార్టీ కట్టిన ఒక్కదానినైనా రేవంత్‌రెడ్డి చూపించగలడా? అని నిలదీశారు. 50 ఏండ్లలో కాంగ్రెస్ కట్టినవి ఏమైనా ఉంటే చూపించాలని సవాల్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో గురువారం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడారు.

### ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదంపై చర్యలేవి?

కాళేశ్వరంలోని రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే ఇంత

> “ఇవ్వాళ ముఖ్యమంత్రి మనసు నిండా తిరుగున్నది ఏమిటంటే.. ఒకవైపు మిస్ వరల్డ్ బ్యూటీస్.. మరోవైపు కాళేశ్వరం మీద నోటీస్! మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు ఈ ప్రభుత్వం చూపిస్తున్నవి ఏమిటి? కేసీఆర్ కట్టిన సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ సెంటర్, బుద్ధవనం, టీ హబ్ తప్ప 50 ఏండ్లలో కాంగ్రెస్ కట్టినవి ఏమైనా ఉంటే చూపుమనండి!” -కేటీఆర్

> “పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో ఏమీ జరగలేదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. పిటిషన్‌ను కొట్టేసింది. ధర్మం.. న్యాయం ముమ్మాటికీ గెలుస్తది. వందకు వందశాతం కాళేశ్వరం మీద కూడా నిజం నిలకడ మీద తేలుతది.” -కేటీఆర్

రాద్ధాంతం చేస్తున్న కాంగ్రెస్.. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై ఏం చర్యలు తీసుకున్నదో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ‘ఫిబ్రవరి 22న ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలింది. నేడు మే 22! అంటే 90 రోజులు గడిచినా అందులో చిక్కుకున్న వారిని బయటకు తీయలేకపోయారు. ప్రభుత్వంలో దక్షత ఉన్న నాయకుడుంటే ఎప్పుడో బయటకు తీసేవాడు. కమీషన్ల కోసం ముందూవెనుక చూడకుండా టన్నెల్ పనులను హడావుడిగా మొదలుపెట్టారు. అది కుప్పకూలి ఎనిమిది మందిని బలిగొన్నది. ఇప్పటివరకు ఒక్కరి మీదైనా చర్యలు తీసుకున్నారా?’ అని నిలదీశారు. రేవంత్, కాంగ్రెస్ కమీషన్ల కక్కుర్తిపై నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కాళేశ్వరం కమిషన్ పేరిట డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు.

### అందాల పోటీలకు రూ.200 కోట్లా?

‘రాష్ట్రంలో 580 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటే, ముఖ్యమంత్రి అందాల పోటీలో ఉండటం కరెక్టా? అన్నదాతల ధాన్యం వర్షంలో కొట్టుకుపోతుంటే, అందాల పోటీల్లో రేవంత్‌రెడ్డి బిజీగా ఉండటం కరెక్టా? ఇదేనా ప్రభుత్వాన్ని నడిపే పద్ధతి? ఒక్క డిక్లరేషన్ అయినా అమలు చేశారా? ఉన్నవాటికే దిక్కులేదు. మళ్లీ ఇప్పుడు నల్లమల డిక్లరేషనట! రైతు, యూత్, విద్యార్థి, బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్లు పోయినయి. ఇప్పుడు ఇంకో డిక్లరేషనా? బిచ్చపోన్ని.. రాష్ట్రం దివాలా తీసింది అంటున్నవు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర రూపాయి లేదంటున్నవు. అందరూ దొంగల్లా చూస్తున్నారంటున్నవు.. మింగమెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె అన్నట్టు అందాల పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు పెట్టడం అవసరమా? బ్యూటీ కాంటెస్టు పెట్టాలని ప్రజలు కోరింద్రా? అందాల పోటీలు పెడితే ఉద్యోగాలు వస్తయని మీ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్తున్నరు. ఎక్కడ ఉద్యోగాలు వచ్చినయి? ఎవరికి వచ్చినయి? మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు మంత్రులంతా టూర్ గైడ్లుగా మారిపోయింద్రు. మంత్రులు సొంగ కార్చుకుంటూ అందాలభామల చుట్టూ తిరుగుతున్నరని సీపీఐ నారాయణ అన్నరు’ అని కేటీఆర్ ఎద్దేవాచేశారు.

### ప్రజాపాలన కాదు.. పర్సంటేజీల పాలన

‘పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై నిజం ఎలా తేలిందో.. ఆరోపణలు శుద్ధ తప్పు అని ఎలా తేలిందో.. కాళేశ్వరంపైనా నిజాలు నిలకడ మీద తేలుతాయి. కాంగ్రెస్ చెప్తున్న ప్రజాపాలన కాస్తా పర్సంటేజీల పాలనగా మారింది. దాని నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ నోటీసులు! కాంగ్రెస్ కమీషన్లు బయట పడుతున్నాయని తెలిశాకే ఇప్పుడు నోటీసుల పేరిట తమాషాలు! జస్టిస్ ఘోష్ తన నివేదిక పూర్తయిందని, విచారణ పూర్తయిందని చెప్పారు. ఆ పెద్దయనే చెప్పిన తర్వాత ఇంకా ఏమున్నది? కమిషన్ గడువు మళ్లీ పొడిగించింద్రు. ఇప్పటికే ఏడుసార్లు ఎందుకు పొడిగించింద్రో ప్రభుత్వం చెప్పాలి. 60 నెలలు టైమ్‌పాస్ చేయాలని చూస్తున్నట్టున్నరు. ఆరు గ్యారెంటీలు అమలు చేసే దమ్ము లేదు. 420 హామీల ఊసులేదు. ఒక్క డిక్లరేషన్‌కు దిక్కు లేదు. రోజుకో డ్రామా ఆడుతున్నరు’ అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

### కమీషన్ల కోసం బరాజ్‌లను కూల్చే ఎజెండా

‘రైతుల ఆత్మహత్యలు.. వడ్ల కొనుగోళ్ల మీద సమీక్షలు లేవు. ఒక్క గ్యారెంటీ అమలు కాదు. మీడియాను మేనేజ్ చేసి డైవర్షన్ గేమ్ ఆడుతున్నరు. బోలెడు నోటీసులిచ్చామంటున్నరు. బోలెడు కమిషన్లు వేసింద్రు. ఏం చేసింద్రు? కాళేశ్వరం నోటీసులు ఇప్పటిదాకా నేరుగా నాకు రాలేదు. అందిన తర్వాత ఏం చేయాలో నిర్ణయిస్తం. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిందన్నరు. పని పూర్తయిందన్నరు. రిపోర్టు తయారవుతోందన్నరు. మళ్లీ ఎందుకు విచారణ పొడిగించాల్సి వచ్చిందో చెప్పాలి? అసలు సీఎం ఏం చేద్దామనుకుంటున్నరు? ఇంకో మూడేండ్లు రిపేర్ చేయను.. కాళేశ్వరం కింద రైతులు పంటలు వేయకుండా ఉండాలని కోరుకుంటున్నరా? రిపేర్ చేసి రైతులకు నీళ్లివ్వకుండా 17 నెలలుగా పంటలు ఎండబెడుతున్నరు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని బరాజ్‌లను కూలగొట్టి మళ్లీ టెండర్లు పిలిచి, 20 నుంచి 30 శాతం కమీషన్లు తీసుకోవాలన్నదే ఈ అసలు ఎజెండా.. కమీషన్లు తీసుకుంటున్నట్టు మీ మంత్రులే చెప్తున్నరు. డబ్బులు ఇవ్వంది ఫైల్ కదలదని ఓపెన్‌గానే చెప్తున్నరు. వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే నోటీసులంటున్నారు. గుల్జార్‌హౌస్‌లో 17 మంది చనిపోతే అటువైపు కన్నెత్తి చూడలేదు. అందాల పోటీలకు ఆరుసార్లు వెళ్లి.. మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు ఒక్కసారీ వెళ్లలేదు. ప్రభుత్వ చేతగాని తనం బయటపడుతుంటే, పాతబస్తీలో పేదలు నిలదీస్తుంటే.. ప్రజల దృష్టి మళ్లించేందుకే కాళేశ్వరం నోటీసులు’ అని కేటీఆర్ ఫైరయ్యారు.

> “ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలి ఇవాల్టికి సరిగ్గా మూడు నెలలు. ఇప్పటికీ అందులో చిక్కుకున్న వారిని బయటకు తీయలేకపోయింద్రు. రేవంత్‌రెడ్డి భాషలో చెప్పాలంటే ప్రభుత్వంలో మొగోడు ఉంటే ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీసేటోడు. కమీషన్ల కోసం ముందూవెనుక చూడకుండా ఎస్‌ఎల్‌బీసీ పనులను హడావుడిగా మొదలుపెట్టి ఎనిమిది మందిని బలిగొన్నది వాస్తవం కాదా?” -కేటీఆర్

### రేవంత్‌రెడ్డిలో అపరిచితుడు

‘సీఎం రేవంత్‌రెడ్డిలో అపరిచితుడున్నడు. ఆయన మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్ అనే మానసిక రుగ్మతతో బాధపడుతున్నడు. అందుకే ఒకే అంశంపై రోజుకోలా మాట్లాడుతడు. ఒక రోజు రాములా.. మరోరోజు రెమోలా మారుతడు.. కాళేశ్వరం కూలేశ్వరమని రెమోలా మాట్లాడుతడు. కాళేశ్వరంలోని మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తెస్తున్నం.. టెండర్ పిలుస్తున్నమని రాములా చెప్తడు. మరి రాము కరెక్టా? రెమో కరెక్టా?.. చెప్పులు ఎత్తుకపోయేవాడిలా చూస్తున్నారు. బిచ్చపు బతుకైందని రెమో అంటడు. తెల్లారి అసెంబ్లీలో లక్షా అరవై వేల కోట్ల అప్పు చేసినట్టు రాము చెప్తడు.. ఎవరు కరెక్టు? చారిత్రక అనవాళ్లయిన చార్మినార్, కాకతీయ కళాతోరణాలను రెమో రాచరికపు పోకడలంటడు.. అవే అనవాళ్లను డ్రోన్‌షో పెట్టి రాము చూపిస్తుంటడు. మిస్ వరల్డ్ పోటీదారులకు అదే చార్మినార్‌ను రాము చూపిస్తడు. రెమోనేమో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామంటడు. అవే అనవాళ్ల దగ్గరకు మిస్‌వరల్డ్ పోటీదారులను తీస్కపోయి రాము ఫొటోలు దింపిస్తడు. కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వలేదని రెమో అంటడు. రాము ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తుంటడు’ అని కేటీఆర్ దెప్పిపొడిచారు.

### పాలమూరు–రంగారెడ్డి ద్వారా నీళ్లివ్వాలి

90 శాతం పూర్తయిన పాలమూరు–రంగారెడ్డిని వెంటనే పూర్తిచేసి పాలమూరు ప్రజలకు సాగునీరు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పాలమూరు బిడ్డనని చెప్పుకొనే రేవంత్ ఆ ప్రాజెక్టును ఎందుకు పక్కన పెట్టారో చెప్పాలని నిలదీశారు. ‘ఆ ప్రాజెక్టుకు మామ పేరు పెట్టుకున్నరు. అందుకైనా మిగిలిన పనులు పూర్తిచేయాలి కదా? పాలమూరు ప్రాజెక్టుపై సుప్రీం తీర్పు చెప్పినట్టే, కాళేశ్వరంపైనా స్పష్టమైన తీర్పులు వచ్చి కాళేశ్వరం ప్రాధాన్యతను తెలియజేస్తయి’ అని కేటీఆర్ తెలిపారు.

# పోలవరం ఎత్తిపట్టి.. కాళేశ్వరం ఎత్తగొట్టి!

- పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కామోష్.. తెలంగాణ కాళేశ్వరంపై కావ్‌కావ్!
- 2019లోనే పోలవరం డయాఫ్రమ్ వాల్ డ్యామేజీ అయినా విచారణ లేదు
- ఇప్పుడు రూ.1000 కోట్లతో కొత్తగా మరో డీవాల్ నిర్మాణానికి ఏర్పాట్లు
- కాళేశ్వరంపై మాత్రం కేంద్రం హడావుడి
- ప్రాజెక్టు మొత్తమే నిరుపయోగమంటూ బురదజల్లే కుటిల యత్నం

పోలవరం జాతీయ ప్రాజెక్టు. కేంద్ర జల సంఘమే దానిని డిజైన్ చేసింది. నిర్మాణాన్ని కూడా పర్యవేక్షిస్తున్నది. అయినా ఆ డ్యామ్ భద్రతకు సంబంధించి అత్యంత కీలకమైన డయాఫ్రమ్ వాల్ నిర్మించిన ఏడాదిలోనే కొట్టుకుపోయింది. దీంతో డ్యామ్ పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది. కానీ ఇప్పటివరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి విచారణ జరపలేదు. కేంద్ర సంస్థ కూడా దాని వైఫల్యాలను చర్చించలేదు. కేంద్రం కూడా ఒక్క మాటా మాట్లాడలేదు. ఇప్పుడు ఏకంగా అంతర్జాతీయ నిపుణులను రంగంలోకి దింపి కొత్తగా దాదాపు రూ.1000 కోట్లకు పైగా ఖర్చుతో మరో డీ వాల్ నిర్మాణానికి పూనుకున్నారు.

కానీ, అదే కాళేశ్వరం ప్రాజెక్టుపై వ్యవహరిస్తున్న తీరు మాత్రం పూర్తిగా భిన్నం. లోపాలమయం అంటూ ముప్పేట దాడి కొనసాగిస్తున్నది. ఎన్‌డీఎస్‌ఏను ముందుపెట్టి ప్రాజెక్టు నిరుపయోగమనే ప్రచారం సాగిస్తున్నది. కేంద్రానికి మద్దతు అన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం సైతం విచారణల పేరిట ప్రాజెక్టును పడావు పెడుతున్నది. గోదావరిని చెరబట్టడమే కేంద్రం లక్ష్యం. గోదావరి జలాలు నిరాటంకంగా దిగువకు తరలిపోయే మార్గం సుగమం చేయడం, అందుకు అడ్డుగా నిలిచిన కాళేశ్వరం గొంతు నులమడమే అసలైన కుటిల పన్నాగం.

– మ్యాకం రవికుమార్

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం దాదాపు 194 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో పోలవరం ప్రాజెక్టు చేపట్టిన విషయం తెలిసిందే. గోదావరిపై దాదాపు 1.47 కి.మీ. పొడవుతో మట్టి, రాతి కట్టను (ఈసీఆర్‌ఎఫ్) నిర్మించాల్సి ఉంది. డ్యామ్ పటిష్టంగా ఉండాలన్నా, లీకేజీలు లేకుండా నీరు నిల్వ ఉండాలన్నా తొలుత డయాఫ్రం వాల్ (డీ వాల్) నిర్మించాల్సి ఉంటుంది. నీటి లీకేజీలను అరికట్టేందుకు, భారీ వరదల నుంచి డ్యామ్ పునాదిని పటిష్టంగా ఉంచడంలో ఇది అత్యంత కీలకం. డీ వాల్ నిర్మాణానికి వరద మళ్లింపు కోసం ఎగువ, దిగువన కాఫర్ డ్యామ్‌లను నిర్మించాల్సి ఉంటుంది. ఇక డీ వాల్‌ను నదిలోపల రాతిపొర నుంచి నదిపై భాగం బెడ్ లెవల్ వరకు నిర్మించాల్సి ఉంటుంది. అది పూర్తయిన తర్వాతే ఈసీఆర్‌ఎఫ్ నిర్మించాలి. పోలవరం డ్యామ్ డీ వాల్ నిర్మాణం అప్పటి సీఎం చంద్రబాబు హయాంలో 2017లో చేపట్టారు. ఎగువన కాఫర్ డ్యామ్ నిర్మించకుండా దాదాపు రూ. 600 కోట్లతో 1.396 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల వెడల్పు, నది అడుగుభాగంలోకి దాదాపు 90 మీటర్ల లోతుతో డీవాల్ నిర్మాణం చేపట్టారు. 2018 చివరినాటికే నిర్మాణం పూర్తి చేశారు. 2020లో వచ్చిన గోదావరి భారీ వరదలకు వాల్ మొత్తంగా 3 చోట్ల దెబ్బతిన్నది. ఒక చోట 200 మీటర్ల మేర కొట్టుకుపోయింది. అనేక చోట్ల డీవాల్ ఇసుక కోతకు గురై అగాథాలు ఏర్పడ్డాయి. ఎగువన కాఫర్ డ్యామ్ నిర్మించకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణం. డీ వాల్ దెబ్బతినడంతో దాదాపు రూ.500 కోట్ల నష్టం వాటిల్లింది. ఈసీఆర్‌ఎఫ్ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తద్వారా ప్రాజెక్టు నిర్మాణం రూ.35 వేల కోట్ల నుంచి 55 వేల కోట్లకు పెరిగింది. పోలవరం డ్యామ్ భద్రతే ప్రశ్నార్థకంగా మారింది.

### కాళేశ్వరం ప్రాజెక్టుపై మరోలా..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో మొత్తంగా 8 బ్లాకులు, 85 గేట్లు ఉన్నాయి. అందులో 7వ బ్లాక్‌లోని 20వ నంబర్ పిల్లర్ 2023 అక్టోబర్‌లో కుంగుబాటుకు గురైంది. అండర్ మైనింగ్ జరగడమే అందుకు కారణమని తెలిసింది. అంటే పిల్లర్ వద్ద వేసిన సీకెంట్ పైల్స్‌లో రెండు చోట్ల ఏర్పడిన లోపం వల్ల దానిగుండా నీటి ప్రవాహం కొనసాగి పిల్లర్ కింది భాగంలో ఇసుక తొడేసింది. తద్వారా పిల్లర్ అడుగు భాగంలో ఇసుక కదిలిపోవడంతో పిల్లర్ కుంగిపోయింది. ఇదే విషయాన్ని ఇంజినీరింగ్ నిపుణులు సైతం నిర్ధారించారు. ఆ తరువాత పలు ఏజెన్సీలు నిర్వహించిన ఈఆర్‌టీ (ఎలక్ట్రోడ్ రెసిస్టివిటి టెస్ట్), గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ టెస్ట్ (జీపీఆర్)లోనూ ఇదే విషయం వెల్లడైంది. మిగతా బ్లాక్‌లన్నీ సేఫ్‌గా ఉన్నాయని తేలింది. సూటిగా చెప్పాలంటే పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డీ వాల్, బరాజ్‌కు సంబంధించి సీకెంట్ పైల్స్ ఒకటే. నిర్మాణ విధానాలు వేరు తప్ప ఆ రెండు నిర్వర్తించే విధులు ఒక్కటే. కానీ విచిత్రమేమిటంటే, పోలవరం ఘటనపై నోరు మెదపకుండా, కొత్త డీవాల్ నిర్మాణానికి ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వమే ఇక్కడ కాళేశ్వరంపై రాద్ధాంతం చేస్తుండడం. కుంగిన పిల్లర్‌ను సాకుగా చూపి పూర్తిస్థాయిలో ఎలాంటి సాంకేతిక పరీక్షలు నిర్వహించకుండానే డిజైన్ లోపాలు, నిర్మాణ లోపాలు, ఓఅండ్ఎం నిర్వహణ లోపాలు అంటూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్ష సాధింపునకు దిగడం విడ్డూరం. పునరుద్ధరణ ఊసెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం సైతం విచారణల పేరిట కేంద్ర సర్కారుకు వంతపాడుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెడుతున్నాయి.

### రూ.1000 కోట్లతో కొత్త డీ వాల్

పోలవరం డీ వాల్ దెబ్బతినడమంటే భారీ నష్టమే. కోట్ల రూపాయల నిధులు వృథా అయినా అక్కడి ప్రభుత్వం ఇప్పటికీ ఒక్క విచారణా చేపట్టలేదు. కేంద్రం కూడా విచారణ చేయించలేదు. కేంద్ర జలసంఘం నోరు మెదపలేదు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ నోరు విప్పలేదు. డీ వాల్ పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం అమెరికా, కెనడా తదితర అంతర్జాతీయ నిపుణులను తీసుకువచ్చి అధ్యయనం చేసింది. సలహాలు, సూచనలు స్వీకరించింది. మరోవైపు భారీ వరదలతోనే డీ వాల్ దెబ్బతిన్నదని పార్లమెంట్ వేదికగా కేంద్రం వెల్లడించింది. వైఫల్యాలన్నీ కప్పిపెట్టి ఇప్పుడు కొత్తగా డీ వాల్ నిర్మాణానికి కేంద్ర జలసంఘం ఆమోదం తెలిపింది. సీడబ్ల్యూసీ రూపొందించిన డిజైన్లకు డ్యామ్ డిజైన్స్ రివ్యూ ప్యానెల్ (డీడీఆర్‌పీ) సైతం ఆమోదం తెలిపింది. ఇప్పటికే నిర్మించిన డీ వాల్‌కు 6 మీటర్ల ఎగువన 1.47 కి.మీ. పొడవుతో కొత్తగా మరో డీవాల్‌ను రూ. 1000 కోట్లతో చేపట్టాలని నిర్ణయించింది. పనులు ప్రారంభం కాగా, ఏడాదిన్నరలోగా పూర్తి చేయాలని షెడ్యూలు ఖరారు చేసింది.




### స్వయంగా ఆరోపణలు గుప్పించిన మోదీ

**పోలవరం** డీవాల్ దెబ్బతిన్న నేపథ్యంలో ప్రాజెక్టు నాణ్యతపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. పోలవరం ప్రాజెక్టు ఏపీకి ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ పలుమార్లు ఆరోపించారు. ప్రాజెక్టు నాణ్యతపై అనుమానాలున్నాయని, దీనిపై దృష్టిసారించారా? లేదా? ఉంటే అందుకు సంబంధించిన వివరాలివ్వాలని, డీ వాల్ పునరుద్ధరణ వివరాలు ఇవ్వాలని గతంలో ఎంపీ కనకమేడల రవీంద్రనాథ్ పార్లమెంట్‌లో కేంద్రాన్ని కోరారు. కానీ కేంద్రం సమాధానమివ్వలేదు. 2020లో వరదలతోనే డీ వాల్ దెబ్బతిన్నదని చేతులు దులుపుకున్నది. తిరిగి డీ వాల్ పునరుద్ధరణ చేపట్టనున్నట్టు కూడా గతంలో ప్రకటించింది. కానీ అవినీతి, నాణ్యతపై మాట్లాడలేదు.


### ఎన్‌డీఎస్‌ఏ ప్రామాణికత ఏంటి?

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్తున్న నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) ఇప్పటివరకు చేసిందేమీ లేదు. దేశవ్యాప్తంగా డ్యామ్‌ల భద్రతా కార్యకలాపాలను పర్యవేక్షించడానికి 2021లోనే దీనిని ఏర్పాటు చేశారు. డ్యామ్ భద్రతా విధానాలను రూపొందించడానికి, ఆనకట్ట భద్రతకు సంబంధించి అవసరమైన నిబంధనలను ఎప్పటికప్పుడు సిఫార్సు చేయడానికి వివిధ విభాగాల్లో నిపుణులు, రాష్ర్టాల అధికారులతో కలిపి డ్యామ్ సేఫ్టీ జాతీయ కమిటీని (ఎన్‌సీడీఎస్) ఏర్పాటు చేసింది. కానీ ఇప్పటివరకు ఇది చేసిందేమీ లేదు. ఎన్‌డీఎస్‌ఏ ఏర్పాటు చేసిన కమిటీల్లో డ్యామ్ నిర్మాణం, భద్రతకు సంబంధించి సర్వే ఇన్వెస్టిగేషన్, డిజైన్, జియాలజిస్ట్, హైడ్రాలజీ, హైడ్రో మెకానికల్ ఇంజినీర్, ఎలక్ట్రికల్ ఇంజినీర్, మెటీరియల్ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీర్, డ్యామ్ బ్రేక్ అనాలసిస్, ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్ ఇంజినీరింగ్, డ్యామ్ కన్‌స్ట్రక్షన్, రిహాబిలిటేషన్ విభాగాల్లో సేవలందించే నిపుణులను నియమించాలి. అన్ని క్యాడర్లలో కలిపి ఎన్‌డీఎస్‌ఏకు కేంద్రం 85 పోస్టులు మంజూరు చేసింది. కానీ ప్రస్తుతం ఎన్‌డీఎస్‌ఏలో ఉన్నది 25 మంది మాత్రమేనంటే దీని పనితీరు అర్థం చేసుకోవచ్చు. ఎన్‌డీఎస్‌ఏ కమిటీనే ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. ఇదిలా ఉంటే ఎన్‌డీఎస్‌ఏ ఏర్పాటు తరువాత దేశవ్యాప్తంగా అనేక భారీ ప్రాజెక్టుల్లో ప్రమాదాలు వాటిల్లాయి. కానీ తమ దృష్టికి వచ్చింది మాత్రం కేవలం 5 సంఘటనలేనని ఎన్‌డీఎస్‌ఏ వెల్లడించింది. అందులో కాళేశ్వరం, ముల్లపెరియార్, తీస్తా, లోయర్ సుబంసిరి, సర్దార్ సరోవర్, తుంగభద్ర వంటి వాటితో సహా డ్యామ్ సంబంధిత భద్రతా సమస్యలు తలెత్తాయి. కానీ ఎన్‌డీఎస్‌ఏ మాత్రం అందులో కేవలం రెండు ఘటనలపైనే నిపుణుల కమిటీలు ఏర్పాటు చేసింది. హిమానీనదాల ఫ్లాష్ ఫ్లడ్స్‌తో తీస్తా రివర్ ప్రాజెక్టులపై పడే ప్రభావాన్ని అంచనా వేయడానికి ఒక కమిటీని, కాళేశ్వరం ఘటనపై మరో కమిటీని ఏర్పాటు చేసింది. అందులో కాళేశ్వరం నివేదికను మాత్రమే 14 నెలల అనంతరం ఇచ్చింది. దీనిని సాకుగా చూపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారానికి పూనుకోవడం రాజకీయమే తప్ప మరేమీ కాదని స్పష్టమవుతున్నది.

### అందుకోసమే కాళేశ్వరంపై కుట్ర

గోదావరిలో నీటిలభ్యత ప్రధానంగా ప్రాణహిత, ఇంద్రావతి నుంచే ఉంటాయని గణాంకాలే చెప్తున్నాయి. ఈ రెండు ఉపనదులు కలిసిన తర్వాత ప్రాజెక్టులు నిర్మిస్తే తెలంగాణ బీడు భూములను గోదావరి జలాలు పావనం చేసేవి. కానీ ఉమ్మడి రాష్ట్రంలో ఆరు దశాబ్దాల పాటు జరిగిన తతంగం అందుకు భిన్నం. ఎక్కడా ఏ చిన్న ఆటంకం లేకుండా, గోదావరి నీరు ఒక్క చుక్క కూడా తెలంగాణ గడ్డ మీద నిలబడకుండా ధవళేశ్వరం దాకా పరుగులు తీయాలనే కుతంత్రానే అమలు చేశారు. అందులో భాగంగానే ఉమ్మడి ఏపీ ఏర్పడేనాటికి గోదావరి జలాల వినియోగానికి సంకల్పించిన.. అప్పటికే మధ్యప్రదేశ్, మహారాష్ట్రతో ఒప్పందాలు పూర్తయి అంతరాష్ట్ర సమస్యలు కూడా పెద్దగా లేని తెలంగాణ చారిత్రక ప్రాజెక్టుల గొంతు సైతం నులిమారు. 350 టీఎంసీల వినియోగానికి రూపకల్పన చేసిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టును 126 టీఎంసీలకు కుదించి ఎందుకూ కొరగాకుండా చేశారు. 300 టీఎంసీల వినియోగానికి ప్రతిపాదించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు, దానికి అదనంగా 100 టీఎంసీలతో ప్రతిపాదించిన కంతనపల్లి ప్రాజెక్టులకు పాతరేశారు. చెరువులను కతం పట్టించారు. తెలంగాణ వాదుల అలుపెరుగని పోరాటాల నేపథ్యంలో కంటితుడుపుగా పలు ప్రాజెక్టులను చేపట్టారు. అవి కూడా ఎక్కడంటే నీటిలభ్యత లేనిచోట. అంటే పుష్కలంగా నీరున్న ప్రాణహిత, ఇంద్రావతి సబ్‌బేసిన్లను వదిలి నీరు అంతగా లభించని చోట ప్రాజెక్టులు కట్టారు. వెరసి పేరుకే ప్రాజెక్టులు తప్ప వాటితో తెలంగాణకు దక్కిన ఫలితం శూన్యం. కాగితాలపై ఆయకట్టును చూపుతూ ఉమ్మడి పాలకులు ఏండ్లుగా కనికట్టు చేస్తూ కట్టిపడేశారు. తెలంగాణ ఏర్పడేనాటికి గోదావరిపై ఉన్న ప్రాజెక్టులతో ఏటా నికరంగా 100 టీఎంసీల జలాలు వాడుకున్న దాఖలాలు లేవంటే ఉమ్మడి పాలకుల కుట్రను అర్థం చేసుకోవచ్చు. కానీ తెలంగాణ ఉద్యమ నేతగా కేసీఆర్ ఉమ్మడి పాలకుల నీటి కుట్రలను పసిగట్టి గర్జించారు. కుటిల పన్నాగాలను తెలంగాణ జనానికి బట్టబయలు చేశారు. స్వరాష్ట్ర ఏర్పాటు తరువాత అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రాణహిత జలాలను ఒడిసిపట్టడమే ప్రధాన లక్ష్యంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. ఇంద్రావతి జలాల వినియోగానికి, అటు దేవాదుల ఆయకట్టుకు భరోసా కల్పించేందుకు సమ్మక్కసాగర్ బరాజ్‌ను నిర్మించారు. దాని దిగువన 60 టీఎంసీల సామర్థ్యంతో సీతమ్మ సాగర్ బరాజ్‌కు శ్రీకారం చుట్టారు. సూటిగా చెప్పాలంటే ప్రాణహిత, ఇంద్రావతి నదుల నీటిని ఒడిసిపట్టి, ఎగువన నీళ్లు లేని గోదావరి ప్రాజెక్టులకు తరలించి తెలంగాణను పంటలతో పచ్చగా మార్చే లక్ష్యంతో కేసీఆర్ ముందుకుసాగారు. సుదీర్ఘ మేధోమథనం సాగించి కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ చేసి అత్యంత స్వల్పకాలంలో పూర్తిచేశారు. ఉమ్మడి పాలకులు సృష్టించిన శతకోటి సమస్యలకు కాళేశ్వరం ద్వారా ఒకే ఒక పరిష్కారం చూపారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి రావడం వల్ల తెలంగాణలోని గోదావరి ముఖచిత్రం మారిపోయింది. ఈ ఒక్క ప్రాజెక్టు ద్వారానే గోదావరిలో మన 954 టీఎంసీల్లో 450 టీఎంసీలకు పైగా వినియోగించుకునేందుకు మార్గం సుగమమైంది. అందుకే ఆ ప్రాజెక్టుపై ఆది నుంచీ ఏపీ అనేక విధాలుగా కొర్రీలు పెడుతూ వచ్చినా ఫలించలేదు. కానీ మేడిగడ్డలో తలెత్తిన చిన్నపాటి సాంకేతిక లోపాన్ని సాకుగా చూపుతూ ప్రాణహిత జలాలను తెలంగాణకు దక్కకుండా చేసే కుట్రలకు ఏపీ మళ్లీ తెరలేపింది. అందుకు అనుగుణంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు నిరర్థకమంటూ ప్రాజెక్టుపై ముద్రవేసే కుటిల ప్రయత్నాలకు పూనుకున్నాయని అర్థమవుతున్నది.

## లోకం పోకడ




తడిసిన ధాన్యాన్ని అంచనా వేయడానికి అధికారులు వచ్చారు

## కేసీఆర్‌కు నోటీసులు రాజకీయ కక్ష సాధింపే

**సర్కారు వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేయత్నం**
**కాంగ్రెస్–బీజేపీ కూటమి పన్నిన కుట్రలో భాగం**
**మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి విమర్శనాస్ర్తాలు**



హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం పాజెక్టును న్యాయస్థానాలు కూడా ప్రశంసిస్తుంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు న్యాయం అని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ కక్షసాధింపు చర్య, ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నమేనని విమర్శించారు. కాళేశ్వరం తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అని తెలిపారు. కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన ఈ పాజెక్టు తెలంగాణలో వ్యవసాయరంగానికి జీవనాడి అని కొనియాడారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రశంసించారని, న్యాయస్థానాలు కాళేశ్వరం ప్రాముఖ్యతను గుర్తించాయని చెప్పారు. కాంగ్రెస్ సర్కారు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నదని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌కు పరిపాలన చేతగాక, ఆరు గ్యారెంటీలను, ఇతర హామీలను అమలు చేయలేక, కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలు ఆడుతున్నదని ఎక్స్ వేదికగా నిప్పులుచెరిగారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం కేవలం రాజకీయ దురుద్దేశపూరిత చర్య అని ధ్వజమెత్తారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అవినీతి జరగలేదని, పారదర్శకంగా, నిబంధనలకు లోబడి నిర్మాణం జరిగిందని చెప్పారు. తమ ప్రభుత్వంలో 20–30 శాతం కమీషన్లు లేకుండా ఏ పనీ జరగడంలేదని కాంగెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే బహిరంగంగా చెప్తున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం పాజెక్టును వైఫల్యంగా చిత్రీకరించడానికి, రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవడానికి బీజేపీ–కాంగ్రెస్ కూటమి కుట్ర పన్నుతున్నదని, కేసీఆర్‌కు ఘోష్ కమిషన్ నుంచి వచ్చిన నోటీసులు ఆ ఎజెండాలో భాగమేనని విమర్శలు గుప్పించారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకముందని, ఎన్ని నోటీసులు ఇచ్చినా, అవి దూది పింజల్లా ఎగిరిపోతాయని తేల్చిచెప్పారు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయని విశ్వాసం వ్యక్తంచేశారు.

## వేధించేందుకే నోటీసులు: వేముల




హైదరాబాద్ మే 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్‌ను వేధించేందుకే కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసిందని, సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో ఈ విషయం తేటతెల్లమైందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్‌ను ఎదుర్కొలేక కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కొని రాజకీయ కుట్రలకు తెరలేపాయని విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు గురుదక్షిణ కోసమే మేడిగడ్డను మాయం చేసే పన్నాగానికి దిగుతున్నారని ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ, చంద్రబాబు కూడబలుక్కొని గోదావరిని చెరబట్టి తెలంగాణను ఎండబెట్టే కుట్రలు చేస్తుంటే.. రేవంత్‌రెడ్డి చేష్టలుడిగి చోద్యం చూస్తున్నారని విరుచుకుపడ్డారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు.

## రాజకీయ కక్షతోనే కుట్రలు: నామా



హైదరాబాద్ మే 22 (నమస్తేతెలంగాణ): రైతుల కడగండ్లు తీర్చేందుకు కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం తెలంగాణకు జీవనాడి అని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు అభివర్ణించారు. దేశానికే తలమానికంగా నిలుస్తున్న ఈ బృహత్తర ప్రాజెక్టును చూసి ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై రాజకీయ కుట్రలకు దిగుతున్నదని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. లక్ష ఎకరాలకు నీరందించడంతో పాటు రాష్ట్ర ప్రజల దాహార్తిని తీర్చిన ఎత్తిపోతల పథకాన్ని విఫల ప్రాజెక్టుగా చూపేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు ఈ ప్రాజెక్టులోని చిన్నచిన్న లోపాలను సరిదిద్ది వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ ప్రజానీకం క్షమించబోదని హెచ్చరించారు.

## కేసీఆర్‌ను విమర్శిస్తే సహించం:చిట్టెం



అమరచింత, మే 22 : అభివృద్ధి ప్రదాత.. అపర భగీరథుడు.. తెలంగాణ సాధకుడు కేసీఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం వనపర్తి జిల్లా అమరచింతలోని బీఆర్‌ఎస్ నేత రాజేందర్‌సింగ్ నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డీపీఆర్ లేకుండా నారాయణపేట–కొడంగల్ పథకాన్ని ఆగమేఘాల మీద మొదలుపెట్టారని ధ్వజమెత్తారు. ఈ ప్రాజెక్టు సీఎం కుటుంబ సభ్యులతోపాటు కాంగ్రెస్ నాయకుల కమీషన్ల కోసమేనని విమర్శించారు.